


# పిచ్చుక గూళ్ళు

విజయ

ఎక్కణ్ణుంచో చక్కని సంకీర్తనం మేలుకొలుపుతూ వినిపించింది. లేచి టైము చూస్తే ఏడు దాటింది. వెంటనే లేచి ఫాన్ ఆపి ఇంట్లోకి వెళ్ళాను. పరీక్షలు బాగా దగ్గరకు వచ్చేశాయి అందుకని రాత్రంతా చదివి ఎప్పుడు నిద్రపోయానో నాకే తెలీదు.

పనులన్నీ ముగించుకుని మళ్ళీ చదువుకోవాలని గదిలో ప్రవేశించి అలవాటుగా ఫాన్ వేద్దామని స్విచ్‌మీద చెయ్యి పెట్టాను. మళ్ళీ వెంటనే వెనక్కి తీసుకున్నాను. అప్పటికే రెండు పిచ్చుకలు బోలెడు గడ్డి ఫాన్ రెక్కలమీద పేర్చి గూడు కట్టే ప్రయత్నంలో వున్నాయి.

“ఈ పిచ్చుకలకేం పన్లేదు గాబోలు అప్పుడే గూడుకట్టటం మొదలెట్టాయి. ఇహ వీటిని తరుముటమే సరిపోతుంది. చదువేం తలకెక్కుతుంది?” అనుకుంటూ విసుగ్గా పుస్తకం తీశాను. తప్పదుగా మరి. మధ్య మధ్య పిచ్చుకల్ని అదిలిస్తూ ఓ గంటో రెండుగంటలో చదివాను. నేను అప్పటికే

# పిచ్చిక గూళ్ళు

మన ఆంధ్రప్రదేశ్ ఒక ప్రాంతంలో మళ్లీపర్వస్ ప్యాసయ్యాను. ఫస్టుక్లాసు కూడా వచ్చింది కానీ నాకొచ్చిన మార్కులు మా వూళ్ళో సీటు సంపాయించటానికి చాల్లేదు.


"ఏమైనా సరే అమ్మాయికి మెడిసిన్ చెప్పించాల్సిందే అని పట్టుపట్టి నన్ను మళ్ళీ పి. యు. సి.లో చేర్పించారు. విసుగుచెందని విక్రమార్కుడిలా చదివిందే చదవటం మొదలెట్టాను. పరీక్షలింకా నెల్లాళ్ళున్నాయి అనగానే నాన్నగారి గది ప్రశాంతంగా చదువుకోటానికని నాకిచ్చేసారు. మధ్య మధ్య నాన్నగారి కోసం ఎవరైనా వస్తే మాత్రం కాస్సేపా గది ఖాళీ చేస్తూ వుంటాను. మిగతా టైమంతా కుర్చీ కతుక్కుపోయి పుస్తకాల్ని పట్టుకుంటాను. చదివింది. ఎంత తలకెక్కిందో పరీక్షలే నిరూపించ గలవు కాని ఈ నెల్లాళ్ళలో పిచ్చుకల సైకాలజీ మటుకు బాగా చదివేశాననుకుంటాను.

"అమ్మా ఒకసారి లే పలికెడతావూ మన వూరి నుంచి తెలిసిన వాళ్ళు వచ్చారు" అన్నారు నాన్నగారు "అలాగే నండీ" అంటూ చిందర వందరగా వున్న పుస్తకాలు ఆదరా బాదరా సర్దేసి ఒక పుస్తకం పుచ్చుకుని పక్క గదిలోకి పరిగెత్తాను, ఎవరో తెలిసిన వాళ్ళు పెద్ద మనుషులని చెప్పారుగా అందుకని అమ్మ కాఫీ కలిపి ట్రేలో పెడుతోంది. "మాతల్లి గదూ కొంచెం ఈ ట్రేలో కాఫీ వాళ్ళకిచ్చి రామ్మా నాకవతల బొయ్యి పూరికే మండిపోతోంది" ప్రతిమాలింది అమ్మ. సరేనని తీసుకెళ్ళి అందరికీ కప్పులందించి వచ్చేయబోతోంటే ఆపి నన్ను వాళ్ళకి పరిచయం చేశారు నాన్నగారు. "కాస్సేపు కూచోమ్మా నువ్వు కూడా అన్నారు వాళ్లు. "తప్పుదా భగవంతుడా ఇంకా ఎంత సేపు కూచోవాలో! చదువుకోవాలని చెప్పి లేచి పోదామనుకున్నాను. కాని వదిలేట్టు లేరు. ఏవో వో పిచ్చిప్రశ్నలేసి నా ప్రాణం తియ్యటం మొదలెట్టారు. చికాకుతో ఓ పుస్తకం తీసి విసురుకోటం మొదలెట్టాను.

"అబ్బ మా వూరుంచి చూశారూ. సంవత్సరానికి తొమ్మిది నెలలు పమ్మరేనండీ ఫ్యాన్ లేకుండా ఒకక్షణం గడపలేము" అంటూనే లేచి నాన్నగారు ఫ్యాన్ స్విచ్ వేశారు. కెవ్వున అరవబోయాను కానీ జరగవలసింది జరగనే జరిగింది. ఫ్యాన్ తిరగడం మొదలెట్టగానే పాపం ఆ గడ్డంతా ఎగిరి ఝామ్మంటూ మా గెస్టుల కాఫీ కప్పుల్లోనూ నెత్తిమీదా పడింది. వాళ్ళు తెల్లబోయారు పాపం! నాకు భలే నవ్వొచ్చింది గానీ బలవంతంగా అణిచేశాను. ఇంక నాన్నగారి మొహం చూడాలి ఎలావుందో పాపం కాఫీ కప్పులు లోపల పెట్టేనెపంతో అక్కణ్ణించి పారిపోయొచ్చేసాను. "వెధవ న్యూసెన్స్ చచ్చిపోతున్నామండీ. ఈ పిచ్చుకలతో ఎక్కడా చోటున్నట్టు ఆ ఫాన్‌మీదే పెడతాయిగూడు. ఎన్నిసార్లు గూడు పడేసి ఎంతపాపం మూటకట్టుకున్నామో" విసుగూ ఆవేదనా ధ్వనించాయి నాన్నగారి కంఠంలో. ఆ తరువాత వాళ్లేమన్నారో వినపడలేదు. వాళ్ళు వెళ్ళగానే వచ్చి నాన్నగారింట్లో అందరిమీదా విసుక్కున్నారు. "బావుంది పిచ్చుక గూడెళ్ళి ఆయనెవరి నెత్తిమీదో పడితే మమ్మల్నీ విసుక్కుంటారేమిటి అదేదో సామెత చెప్పినట్లు అంది అమ్మ.

మమ్మల్నందర్నీ అకారణంగా తిట్టించిన ఆ పిచ్చుకలమీద మహాకోపం వచ్చింది. ఎలా అయినాసరే ఇవాళ వీటిఅంతు చూడాలి అనుకుని భోజనం అదీ కానిచ్చి మళ్ళీ ఆ గదిలో ప్రవేశించాను. "ఇవాళంతా అసలుఫాన్ ఆపను. ఎక్కడ పెడతాయో గూడు చూద్దాం" అనుకుంటూ మళ్ళీ చదువు కుపక్రమించాను. పాపం ఆ పిచ్చుకలు కిచకిచ లాడుకుంటూ ఓ తొంభైసార్లటూ ఓ తొంభైసార్లిటూ తిరిగి ఎటో వెళ్ళిపోయాయి. ఇదివర కొకసారి ఫాన్ రెక్కంటి కొట్టుకుని ఓ పిచ్చుక చచ్చిపోయింది.

కరెంటు పోయింది కాబోలు ఫాన్ ఆగిపోయింది. ఎంత సేపట్నుంచి వెయిట్ చేస్తున్నాయో ఏమిటో పాపం. మూలనపడ్డ గడ్డంతా ముక్కుతో పట్టుకుని మూడు నిమిషాల్లో ఫాన్ మీదకి చేర్చేసాయి. నే నెన్నిసార్లు "హుష్" అని అదిలించినా లాభంలేక పోయింది. నెల్లాళ్ళనుంచీ వాటికది అలవాటయిపోయి. నా అదిలింపులు ఖాతరుచేయ్యటం మానేసాయి. నాకు భలే రోషంవచ్చింది. విజయగర్వంతో ఓ పిచ్చుక నావైపు చూసింది. ఇంతలో కరెం టొచ్చేసింది. ఇంకేముంది ఇంత సేపట్నుంచీ అవి చేర్చిన చెత్తంతా గిరగిరా తిరుగుతూ ఎగురుతూ ఒక్క సెకండులో కిందపడి పోయింది. గదంతా అసహ్యంగా అయిపోయింది చెత్తతో. "రోగం కుదిరింది ఈ సారి పూడ్చి చెత్తంతా కాలవలో పారేద్దా" మనుకుని ఇంట్లోకి వెళ్ళాను చీపురు తేవటానికి వచ్చేసరికి మళ్ళీ కరెంటుపోయింది. ఒక్క పరక గూడా కింద లేకుండా



ఫాన్ మీదికి చేరిపోయింది చెత్తంతా. ఏందుకైనా మంచిదని చీపురు మూల వుంచేసి మళ్ళీ పుస్తకాలు తీసాను. ఇంతలో మళ్ళీ కరెంటురావడం పిచ్చుకగూడు కిందపడిపోవడం క్షణంలో జరిగిపోయింది. ఈసారి పిచ్చుకలవ చూస్తే జాలివేసింది. అయ్యోపాపం ఎంతకష్టపడి కట్టుకున్నాయో గూడు కళ్ళముందే ఎలా కూలిపోయిందో అని ఈసారి పిచ్చుకలు నావైపు జాలిగా చూసినట్టనిపించింది. ఆరోజంతా కరెంటురావటం పోవటం అయినా పిచ్చుకలు గూడు కట్టేపని మట్టుకు మానలేదు. అప్పు వీటికెంత ఓర్పు అనిపించింది. ఇంచుమించు రోజూఇలాగే జరుగుతుంటుందికదా అయినా వాటికి విసుగు రాలేదే వాటికసలు బాధేలేదా? అవి కట్టుకున్న గూళ్ళు కళ్ళముందే కూలిపోతుంటే? అ వాటికి బాధేమిటి? అసలు బాధ అంటే ఏమిటో వాటికి తెలిస్తేగదా? వట్టి తెలివి తక్కువ పిచ్చుకలు అమాయకపు పిచ్చుకలు అవివేకపు పిచ్చుకలు అనిపించింది.

మరి మనిషిమాటేమిటి? పిచ్చుకలమీంచి మనిషి మీదకు మళ్ళాయి ఆలోచనలు. అవి పిచ్చివేకావచ్చు కానీ మనుషులు మటుకు వాటికంటే ఎందులో మెరుగు? కష్టాలూ నష్టాలూ నిరాశలూ నిస్పృహలూ ఎదురైతే చేతులు ఎట్టుకుని మూల కూచుంటాడామనిషి?

కొన్నేళ్ళ క్రిందట వ్యాపారం పేకమేడలాగా నేలకూలిపోయినా నాన్నగారు ఎన్నోకష్టాలుపడి మళ్ళీ ఇప్పుడిప్పుడేగా నిలదొక్కుకుంటోంది. ఇది మట్టుకు పిచ్చుకగూడులాగ కూలిపోదని ఏమిటి హామీ? అయినామటుకు తన ప్రయత్నాలు మానేస్తారా? ఏమీ మానరు. కిందపడినా మళ్ళీ సన్నటి దారం ఆధారం చేసుకుని పైకి పాకే సాలెపురుగులాగా మనిషి ఆశలు గూడు కట్టుకోటానికి పెనుగులాడుతూనే వుంటాడు.

ఎనభైయేళ్ళ జీవితంలో ఎన్నో జననాలూ మరణాలూ చూసి అస్థిపంజరమైపోయిగూడా తాతగారింకా బ్రతుకుమీది తీపి వదులుకోరెందుకని? తన శరీరాన్ని ఎంతో గారాబంగా చూసుకుంటూ అంత ఆరాటపడతారెందుకని? ఇంకా పుష్టిగా ఆహారం కావాలి మామూలుగా జరిగే క్రమంలో ఒక్క వాని తేడా వచ్చినా ఏ మాత్రం వూరుకోరు.

రేపో మాపో అమెరికా వెడతాడు పైచదువుల కనుకున్న మామయ్యను ఆవిధంగా లారీ అమాంతంగా పొట్టన పెట్టుకోటం తలచుకుంటే మానవుల ఆశలతో విధి ఎంత హృదయం లేని రక్కసిలాగా చెలగాటం ఆడుతోంది అనిపిస్తుంది.

"మనందరం మట్టుకు రంగురంగుల కలల గాలి మేడలూ కట్టుకోవడం లేమూ? నేనేకో డాక్టర్నవ్వాలని, తమ్ముడు అమెరికా వెళ్ళాలని అమ్మకు వాడిమీద పాతికో ఏభైవేలో రాబట్టుకోవాలని, నాన్నగారికి వ్యాపారాన్ని ఇంకాఇంకా పెంచి ఇంకాధనవంతులైపోవాలని మొదటి కాన్పుకే ప్రాణగండం గడిచిన అక్కయ్యకు ఇంకా ఆడపిల్లకావాలని ఈకలలన్నీ వీటిలో బుడగలు కావూ? ఇవి మట్టుకు అజ్ఞానంతో అవివేకంతో కట్టుకున్న పిచ్చుక గూళ్ళుకావూ? ఏదో భయంకర రహస్య హస్తం వీటిని కూడా కూల్చివేస్తుందేమో? మన స్వంతా అదేదో చెప్పలేని బాధతో నిండిపోయింది ఎవరిజీవితమైనా అంతేకదా అనుక్షణం రంగులు మారుతూనే వుంటుంది మృత్యువు తనమీద ఉరక టానికి మలుపులో పొంచి వుందని ప్రతివాడికీ తెలుసు. అయినా ప్రాణి ఆశలతో. ఆశ బూలతో హృదయ మందిరంలో రంగుకాగితాల తోరణాలు కట్టుకోవటం మానదు. తన కలకు ఇలలో రూపురేఖలు దిద్దటం కోసమే మనిషి నిరంతరం పెనుగులాడతాడు. ఇంక పిచ్చుకల్ని చూసి జాలిపడటం ఎందుకూ?

మళ్ళీ నాదృష్టి పిచ్చుకలవైపు మళ్ళింది. ఎక్కడించో గింజలు ఏరుకొచ్చి తింటున్నాయి. ఒక చక్కని నిజం నాకళ్ళకి కట్టినట్టయింది. ఎంత కష్టపడ్డా పాపం ఆ చిన్నపొట్టకోసమేకదా. తరువాత నిలువ నీడకోసం. మనిషికి అవసరాలు హెచ్చు. అవన్నీ తీర్చుకోడానికింకా కష్టపడ్డా జీవితం అశాశ్వతం అనుకుంటూ ఓ మూల కూచుంటే అవసరాలు తీరేదెలా? నేనిలా పిచ్చుకలమీదా పిల్లలమీదా ఆలోచిస్తూ కూచుంటే నాకల నిజం ఎలా అవుతుంది?"

అనాది కాలంనుంచీ మానవులు చేస్తున్న ప్రయత్నాలు పెంచుకున్న ఆదర్శాలూ హృదయాకాశాల్లో శంపాలతల్లాగా మెరిపించుకుంటున్న స్వప్నాలూ. అవీ ఇవన్నీ ఏమిటి గిరగిరా తిరిగే సీలింగు ఫాన్ రెక్కదెబ్బ తగలగానే తుప్పున నేలకూలి స్పందించే మాంసపు ముద్దగా మారిపోయే ఈ వెర్రి పిచ్చుకలకూ, కాలచక్రపు ఉగ్రవేగానికి స్వప్నాలన్నీ శిథిలశకలాలయిపోయే మానవులకూ ఎంత దగ్గరిచుట్టరికం! అవును మృత్యుకేసరి భీకరంగా గర్జిస్తున్నా జీవితహరిణం బంగరు గజ్జెలతో చెంగు చెంగున త్రుళ్ళింత లాడుతూనే వుంటుంది. ప్రమాదాలను చూసి ప్రమోదాలు చెదరవు. పరాజయాలకు భయపడి ప్రయత్నాల రెక్కలు ముడుచుకోవు.

"ఏమిటా చదువుతున్నావా శూన్యంలోకిచూస్తూ కూచున్నావా?" అని అమ్మ పెద్దగా కేకేసింది. ఉలిక్కిపడి పుస్తకం చూసాను. ఎక్కడ ఆపానో కూడా గుర్తులేదు. "ఇంక లాభంలేదు ఈ గది లోంచి మకాం మార్చెయ్యాలి లేకపోతే మార్కులు లావటం మాట దేవుడెరుగు, ప్యాసవటం కూడా పుట్టదే ... మళ్ళీ ఆ ప్రకరణం తెరిచి మొదటి నుంచీ చదవడానికి ప్రయత్నించాను. ●

